కరాన త్రిశూలం.. ఉరాన ఎముకల పేరు.. శిరాన నెలవంక ధరించిన పరమశివుడిని భక్తులు శ్రద్ధతో ఆరాధించారు. లింగ రూపంలో భువిపై ఉద్భవించిన కాల స్వరూపుడిని భక్తితో అర్చించారు. పంచ భూతాలకు అతీతుడు, లయకారుడైన జటాజూటధారిని ఓంకార నామ స్మరణ చేస్తూ పూజించారు. బుధవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని పురాతన, ప్రముఖ శైవ క్షేత్రాలు భక్తుల హర నామ స్మరణతో మారుమోగాయి. లింగోద్భవ పూజల్లో పాల్గొని, శివపార్వతుల కళ్యాణాన్ని కనులారా తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు.

సర్వం.. సదాశివం..

- హర నామ స్మరణతో మారుమోగిన శివాలయాలు
- ఊరూవాడా వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు
- భక్తులను అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


తర్లుపాడులో సహస్ర లింగేశ్వరస్వామికి అభిషేకం


గిద్దలూరు : ప్రత్యేక అలంకరణలో భీమలింగేశ్వరస్వామి


రాచర్ల : ప్రత్యేక అలంకరణలో సిద్ధిభైరవేశ్వర స్వామి


మార్కాపురం : ప్రత్యేక అలంకరణలో పూజలందుకుంటున్న మార్కండేశ్వర స్వామి

బేస్తవారిపేట: మండలంలో పురాతన శైవ క్షేత్రాలైన మోక్షగుండంలోని ముక్తీశ్వరస్వామి, ఒందుట్లలోని బృగు మహేశ్వరస్వామి, పిటికాయగుళ్లలోని పిటికేశ్వరస్వామి, సలకలవీడులోని రామలింగేశ్వరస్వామి, పందిళ్లపల్లెలోని వ్యాఘ్రమల్లేశ్వరస్వామి, జేబీకే పురంలో ఆదిసిద్ది భైరవస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సలకలవీడులో ఆలయ ధర్మకర్త బిక్కా రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో హోమాలు, శివపార్వతుల కళ్యాణం కనులపండువగా నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం 4 గంటల నుంచి కులుకు భజన, రాత్రికి సత్యహరిశ్చంద్ర, చింతామణి నాటకం భక్తులను ఆకట్టుకున్నాయి.

గిద్దలూరు రూరల్: పట్టణంలోని పాతాళ నాగేశ్వరస్వామి, కె.ఎస్.పల్లె గ్రామ సమీపంలో భీమలింగేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి స్వామి వారి కల్యాణ మహోత్సవం కనుల పండువగా సాగింది. పాటకచేరి, భరతనాట్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదానం చేయడంతోపాటు అల్పాహారం అందించారు. పాపులవీడు, సంజీవరాయుడుపేట అటవీ ప్రాంతంలో గల భోది క్షేత్రం, దిగువమెట్ట అటవీ ప్రాంతంలో కొలువుదీరిన గుండ్లబ్రహ్మేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయం వద్దకు వెళ్లే వాహనాలను గుండ్లకమ్మ రేంజ్ ఆఫీసర్ శివవంశీ కృష్ణకుమారి ఆధ్వర్యంలో అటవీ శాఖ సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించారు. నిబంధనల మేరకు 100 వాహనాలను అడవి లోపలికి అనుమతించారు.

కొమరోలు: మండలంలోని గోపాలునిపల్లె గ్రామంలో త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయం, పామూరుపల్లెలో సాంబసదాశివాలయం, దామెర్ల చెరువు వద్ద వెలసిన భైరవేశ్వరస్వామి ఆలయం, పొట్టిరెడ్డిపల్లె గ్రామ సమీపంలో కొండల్లో కొలువైన భృగుమల్లేశ్వర స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

కంభం: మండలంలోని కనక సురభేశ్వరకోన, చిన్నకంభం వీర భద్రస్వామి ఆలయం, రావిపాడులోని భీమేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. చిన్నకంభంలో కోలాటం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలను తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

రాచర్ల: మండలంలోని రామాపురం గ్రామ సమీపంలోని సిద్ధిభైరవేశ్వర ఆలయం, సత్యవోలులోని రామలింగేశ్వర ఆలయాలకు వేలాది మంది భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. సిద్ధిభైరవేశ్వర ఆలయంలో మహిళలు కర్పూర దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా దేవస్థానం ధర్మకర్త మదిరె శ్రీరంగారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

మార్కాపురం/మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని మార్కండేశ్వరస్వామి ఆలయం, మండలంలోని వేములకోట గంగాభవానీ రామలింగేశ్వరస్వామి శివాలయం, తిప్పాయపాలెంలోని మునీశ్వరాలయంలో భక్తులు శివుడిని దర్శించుకుని పూజలు చేశారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు శ్రీశైల మల్లన్న, త్రిపురాంతకేశ్వరస్వామి దర్శనానికి బారులుదీరాయి. మార్కండేశ్వర స్వామి ఆలయంలో ఈఓ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు దంపతులు అభిషేకంలో పాల్గొన్నారు. లింగోద్భవ కాలంలో రుద్రాభిషేకం అనంతరం శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని జగదాంబ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మునీశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పూజలు నిర్వహించి ఎడ్ల పందేలను ప్రారంభించారు. ఆలయాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడులోని సహస్ర లింగేశ్వరస్వామి, కేతగుడిపిలోని కేదారేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అభిషేకాలు చేశారు. మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, కుటుంబ సభ్యులు పూజల్లో పాల్గొన్నారు. జగన్నాథపురంలోని వీరభద్రస్వామి ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై పూజలు చేశారు.

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు రుద్రేశ్వరాలయం, బ్రాహ్మణపల్లిలోని కాశీవిశ్వేశ్వర ఆలయం, సలనూతల రామలింగేశ్వరస్వామి ఆలయం, ఎదుర్రాళ్లపాడు, అంబాపురం గ్రామాలలోని సంగమేశ్వర దేవాలయాలు, కొనకనమిట్ల రామదూత క్షేత్రం, శివాలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. ఎదుర్రాళ్లపాడు, సలనూతల ఆలయాల్లో శివపార్వతుల కళ్యాణోత్సవం కనుల పండువగా సాగింది. గోమాతలను పూజించి మహిళలు భక్తిని చాటుకున్నారు. ఆలయాల్లో భక్తులకు అన్నసంతర్పణ చేశారు. రాత్రికి జాగారం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు ఏర్పాటు చేశారు.

పొదిలి రూరల్: దక్షిణ కాశీగా పేరుగాంచిన పొదిలి పట్టణంలోని పార్వతీ సమేత నిర్మమహేశ్వర దేవస్థానంలో స్వామివారు నంది వాహనంపై ఉమామహేశ్వర అలంకారంలో భక్తులు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అలాగే మండలంలోని ఏలూరు, ఉప్పలపాడు, ఆముదాలపల్లి, పాములపాడు, కుంచేపల్లి, మల్లవరం, ఓబులక్కపల్లి, రామాపురం, జువ్వలేరు గ్రామాల్లోని శైవ క్షేత్రాలకు భక్తులు క్యూకట్టారు.


బేస్తవారిపేట : సలకలవీడులో రామలింగేశ్వర స్వామికి భక్తుల పూజలు


మార్కాపురం : మార్కండేశ్వర ఆలయంలో అన్నా దంపతుల పూజలు


పూజలందుకుంటున్న నిర్మమహేశ్వర స్వామి


కొమరోలు : త్రిపురాంతకేశ్వరస్వామి కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


గిద్దలూరు : భీమలింగేశ్వరస్వామి కళ్యాణోత్సవం


చిన్నకంభం వీరభద్రస్వామి ఆలయంలో చిన్నారుల పూజలు


పొదిలిలో నిర్మమహేశ్వరస్వామిని దర్శించుకున్న చెవిరెడ్డి, అన్నా, పార్టీ నాయకులు

నిర్మమహేశ్వరస్వామి సేవలో చెవిరెడ్డి, అన్నా

మహా శివరాత్రి సందర్భంగా పొదిలిలోని నిర్మమహేశ్వర స్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా వెంకటరాంబాబు పూజలు నిర్వహించారు. అర్చకులు ఆశీర్వచనం అందజేసి, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. చెవిరెడ్డి వెంట పార్టీ రాష్ట్ర పంచాయతీ రాజ్ వింగ్ సెక్రటరీ సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, జి.శ్రీనివాసులు, ఫిరోజ్, బ్రహ్మారెడ్డి, సింగారెడ్డి వెంకటేశ్వర రెడ్డి తదితరులు ఉన్నారు.


సిద్ధిభైరవేశ్వర స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు


మార్కండేశ్వర ఆలయంలో భక్తుల కిటకిట


వీరభద్ర స్వామి ఆలయం వద్ద కోలాట ప్రదర్శన


కొనకనమిట్ల : పెదారికట్ల శివాలయంలో..


పొదిలి శివాలయంలో బారులుదీరిన భక్తులు


కొనకనమిట్ల : బ్రాహ్మణపల్లిలో శివుని దర్శనం కోసం..


పొదిలి పురవీధుల్లో ఊరేగుతున్న నిర్మమహేశ్వరస్వామి

భక్తిశ్రద్ధలతో వెంకటేశ్వరస్వామి కళ్యాణం


ప్రత్యేక అలంకరణలో కల్యాణ వెంకటేశ్వరస్వామి

మార్కాపురం టౌన్: పట్టణ శివారులోని జంకె రామిరెడ్డి నగర్‌లో కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం స్వామివారికి శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఉభయదేవేరులతో కలిసి స్వామివారి ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించి కళ్యాణ క్రతువును నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చక్కా మాలకొండ నరసింహారావు, ఊటుకూరి రామకృష్ణ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రామలింగేశ్వరస్వామి నిత్య దీపారాధనకు విరాళం


విరాళం అందుకుంటున్న గ్రామ పెద్దలు

కొనకనమిట్ల: మహాశివరాత్రి పండగను పురస్కరించుకుని మండలంలోని సలనూతల రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఏడాదిపాటు నిత్య దీపారాధనకు మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు తనయుడు కృష్ణచైతన్య విరాళం అందజేశారు. విరాళాన్ని పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ అన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సానికొమ్ము వెంకటసుబ్బారెడ్డి, ముద్వా వెంకటేశ్వరరెడ్డి చేతుల మీదుగా దీపారాధన నిర్వాహకులు ఆరికట్ల మధుకు అందించారు. కార్యక్రమంలో సలనూతల సర్పంచ్ విడగొట్టు అంజనీకుమారి, అంజయ్య, ముంగమూరి వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు ముక్కు లక్ష్మీనరసారెడ్డి, బత్తుల శ్రీను, చినవెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎం, క్లబ్ అధ్యక్షుడు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఆవరణలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మంచి నీటి, మజ్జిగ చలివేంద్రాన్ని డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు టీవీ రామకృష్ణారావు బుధవారం ప్రారంభించారు. శ్రీశైలం వెళ్లే యాత్రికులు, ఇతర ప్రయాణికుల సౌకర్యార్థం మంచినీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని డిపో మేనేజర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, జగన్‌బాబు, నారాయణరెడ్డి, ప్రభాకర్, జవహర్ తదితరులు పాల్గొన్నారు.

భవనం రామచంద్రారెడ్డికి పితృ వియోగం

తర్లుపాడు: తర్లుపాడుకు చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి భవనం రామచంద్రారెడ్డి తండ్రి పెద్ద వెంకటరెడ్డి(80) బుధవారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందిన పెద్ద వెంకటరెడ్డి ఇటీవల ఇంటికి వచ్చారు. ఆరోగ్యం క్షీణించడంతో బుధవారం సాయంత్రం స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు తర్లుపాడు చేరుకుని పెద్ద వెంకటరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. తర్లుపాడులో గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.